క్లుప్తంగా

ఆస్పత్రిలో పింఛను అందజేత



దుర్గి: అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన మహిళకు పెన్షన్ అందించిన సంఘటన జరిగింది. మండల కేంద్రం దుర్గికి చెందిన బండ్ల నాగమణి అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పేద కుటుంబం కావటంతో ఆస్పత్రిలోని ఖర్చులకు డబ్బు అవసరాన్ని గుర్తించిన వలంటీర్ తాళ్ళూరి శిరీష తన సొంత ఖర్చులతో నరసరావుపేట వెళ్లి నాగమణికి పెన్షను అందజేసింది.

పిడుగురాళ్లలో 43.3 మిల్లీ మీటర్ల వర్షం



పిడుగురాళ్ల: పట్టణం, మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు నేలకొరిగాయి. అంతేకాకండా కొన్ని ప్రాంతాలలో వర్షం నీరు నిలిచిపోయింది. మండలంలో 43.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలియజేశారు.

మాచర్లలో 46 మి.మీ వర్షపాతం

మాచర్ల : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు భారీ వర్షంతోపాటు, ఈదురుగాలులు వీచాయి. తుపాన్ కారణంగా పంట పొలాలకు నష్టం వాటిల్లింది. మాచర్ల మండలంలో 46 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంతోపాటు, మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తుపాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అన్ని వ్యాపార, సంస్థలు మూతపడ్డాయి.

కూలిన పూరిల్లు



పిడుగురాళ్లరూరల్: పట్టణంలోని కుమ్మరిపాలెంలో రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు షేక్ రమవత్ బి మహిళ పూరిగుడిసె నేలవాలింది. నేలవాలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారి సత్యారెడ్డి పరిశీలించి లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని అందజేస్తామని తెలియజేశారు.

తప్పుడు దరఖాస్తులపై చర్యలు

శావల్యాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫాం-7 తొలగింపు ఓట్లు కోసం నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందజేసిన వారికి నోటీసులు ఇవ్వటానికి రంగం సిద్ధం చేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు వెల్లడించారు. ఎన్నికల నిబంధనలు మేరకు డబల్ ఓట్లు తొలగింపులు నేపథ్యంలో క్షేత్రస్థాయి చర్యలు చేపట్టగా ఇందులో భాగంగా కొందరు వ్యక్తులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు ద్వారా ఫాం-7 తొలగింపు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అలాగే కొంత మంది వ్యక్తులు ఫాం-7 ఐదు కంటె తక్కువ దరఖాస్తు చేసుకుంటే చర్యలు ఉండవని అపోహల్లో ఉన్నారన్నారు. ఫాం-7 అర్జీలో తప్పుడు ధ్రువీకరణ పత్రా లను అందజేసిన ఏఒక్కరినీ వదలమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

10న శ్రీకాళహస్తిలో కార్తిక వన సమారాధన

నరసరావుపేట ఈస్ట్: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీ ఆదివారం శ్రీకాళహస్తిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొగ్గారం బ్రహ్మానందం తెలిపారు. ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మానందం మాట్లాడుతూ, ఫౌండేషన్ శాశ్విత సభ్యుల సమక్షంలో జరగనున్న కార్తిక వన సమారాధనలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వన సమారాధనలో భాగంగా ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి సహకారాన్ని అందిస్తున్న శ్రీవాసవి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు జూలుగంటి మురళీమోహన్ గుప్త, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కాకుమాను సత్యనారాయణ, కోశాధికారి సీతారామాంజనేయులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఏ.గాయత్రిసురేష్ (శ్రీకాళహస్తి), రెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పిడుగురాళ్లకు మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలు రకాలు పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోవిందాపురం వద్ద మంచినీటి పంప్ హౌస్‌ను మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు మంచినీటిని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొద్ది రోజులుగా మంచినీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తడంతో సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు పనులు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. పైప్‌లైన్లు మరమ్మతులకు గురవడంతో పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కృష్ణాదిలో నీటిమట్టం తగ్గడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, నదిలోకి మరో 6 మీటర్లు పొడవున పైపులైను ఏర్పాటు చేస్తే నీటి సమస్య ఉండదని తెలిపారు. వేసవిలోగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలియజేశారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై చర్చించారు. ఆయన వెంట మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, ఎంపీడీఓ వరప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు.



పైపులైను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్లరూరల్: తుపాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో పట్టణ, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు 33 వార్డుల్లోని 17 సచివాలయాల అధికారులను, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అంతేకాకుండా శివారు ప్రాంతాలలోని ప్రజలు వర్షాలకు ఇబ్బంది పడకుండా అక్కడి అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెట్లు విరిగి ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీవో కాశయ్య అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంటలను పరిశీలించి పంట నష్టం జరగకుండా రైతులకు పలు సూచనలు సలహాలు అందించాలన్నారు.

సత్రశాలలో కార్తీక పూజలు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్పటికలింగం



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబికాదేవి

సత్రశాల(రెంటచింతల): కైలాసనాథుడు శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం సందర్భంగా మంగళవారం అతిపురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, రుద్ర, గణపతి హోమాలు నిర్వహించారు. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి, కార్తీక దీపాలు వెలిగించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, హోమాలలో పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

మాచర్ల: పట్టణంలో కార్తీకమాసం పురస్కరించుకుని మంగళవారం శ్రీశైలం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం, సొసైటీ కాలనీలో మాతా అన్నపూర్ణేశ్వరి, 20వ వార్డులోని వీరభద్రుని దేవాలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో కనకదుర్గ దేవాలయం, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీకమాస పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి

ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి అన్నారు. ఎన్నికల కమీషన్, పల్నాడు జిల్లా ఎన్నికల ముఖ్యాధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగి ఓటు హక్కు లేని వారందరూ ఈ నెల తొమ్మిదిలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా అక్టోబర్ 27న ప్రచురించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు కోరారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో స్వీకరించిన దరఖాస్తులు, నియోజకవర్గంలో గతంలో ఫైనల్ పబ్లికేషన్ నుంచి ఇప్పటివరకు చేర్చబడిన, తొలగించబడిన, సవరింపబడిన ఓట్ల వివరాలను తెలియజేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్

పిడుగురాళ్లరూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు. అధిక తేమ వలన అవసరమైన పోషకాలు అందక పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతులోపాలు కూడా కనబడే అవకాశముందన్నారు. పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. మిరప పంట ప్రస్తుతం పూత నుండి కాయ ఏర్పడే దశలోను, లేదా శాఖీయ దశలో ఉందన్నారు.

తీసుకోవాల్సిన చర్యలు..

పొలంలో అధికంగా వున్న నీటిని వెంటనే బయటికి పంపించే ఏర్పాటు చేయాలి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలన్నారు. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని ఒక దాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ, కోనోధారా వంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది కాబట్టి, ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రైన్ కోట్లు అందజేత



మాజేటి నరేంద్ర, కొలిశెట్టి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: విపత్తు సమయాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని ఆర్యవైశ్య విద్యానిధి కన్వీనర్ పాట్టి శ్రీరాము లు చెప్పారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణ మండప సంఘం, ఆవోపా, ఆర్యవైశ్య విద్యానిధి సంయుక్త ఆధ్వర్యంలో 90 మంది పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం రైన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చేయూతనందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కేవీఎస్ కృష్ణుడు,

తుఫాన్ ప్రభావంతో స్తంభించిన జనజీవనం

దుర్గి: బంగాళాఖాతంలో ఏర్పడిన మీచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా మండల వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుంది. మంగళవారం మండల కేంద్రం దుర్గికి పలు గ్రామాల నుంచి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షం మూలంగా మెట్ట పంటలైన కంది, మిర్చికి ఊరటనిచ్చింది. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమయ్యింది. తహసీల్దారు జి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఎటువంటి నష్టం సంభవించలేదన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు తుపాను కారణంగా ఎటువంటి ఇబ్బందులు కలిగిన ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించి ప్రభుత్వ సహకారం పొందాలని కోరారు. భారీ వర్షంతో కుంటలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. రాబోవు రోజులలో భూగర్భ జలాలు పుష్కలంగా లభించడంతో బోరుబావుల నుంచి నీటికి ఇబ్బంది ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పంటలకు నష్టం వాటిల్లకుండా పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి వై.అమీర్ రెడ్డి సూచించారు. ఈదురుగాలులకు చలి ఉధృతి పెరిగింది. రాబోవు రెండు రోజులు తుపాను ప్రభావం ఉంటుందని ప్రజల అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

చోరీపై కేసు నమోదు



సత్తెనపల్లి: ఇంటి ముంగిట నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాత సుగాలికాలనీలో నివసిస్తున్న గార్లపాటి అభిషేక్ తన ఎంసీవైఎస్ 200సీసీ ఏపీ 39ఎల్ డీ4841 నెంబర్ గల ద్విచక్ర వాహనాన్ని రాత్రి పది గంటల సమయంలో ఇంటి ముందు నిలిపి తాళం వేశాడు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు బయటికి రాగా వాహనం మాయమైంది. ఎక్కడ వెతికినా లభించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో వృద్ధురాలికి పింఛన్ అందజేత



పింఛన్ నగదు వృద్ధురాలికి అందచేస్తున్న వలంటీర్ కృష్ణ

ఎర్రబాలెం(క్రోసూరు): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మంగళవారం పింఛన్ అందజేశాడు. మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు సుగుణపుష్పావతి కాలికి గాయం అవటంతో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సమాచారం తెలుసుకున్న వలంటీర్ కృష్ణ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేయటం జరిగింది.

మేనిఫెస్టోని 100శాతం అమలు చేసిన జగనన్నే సీఎం కావాలి



మా నమ్మకం నువ్వే జగన్ ప్రచార కిట్లను అందజేస్తున్న పీవీఆర్

వెల్దుర్తి: సంక్షేమ పథకాల ద్వారా 100శాతం మేనిఫెస్టోని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కండ్లకుంట గ్రామ సచివాలయ పరిధిలోని కండ్లకుంట, గుడిపాడు చెరువు, చలమల గ్రామాలలో జగనన్నే రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎందుకు కావాలనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలన్నారు. అనంతరం డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయ పరిధిలోని సంక్షేమం, అభివృద్ధి ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేశారన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగు మల్లి సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రూప్లీ బాలు నాయక్, మల్లుస్వామి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కె.పాపిరెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ ఈడెబోయిన వెంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి వెంకటలక్ష్మారెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, పిన్నెల్లి వెంకటరెడ్డి, పంగా చిన కాశయ్య, జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు, తంగిరాల శివారెడ్డి, వలంటీర్లు, గృహ సారథులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

పిడుగురాళ్లరూరల్: పట్టణ, మండలంలోని వరి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మిచాంగ్ తుపాన్ వలన నేలవాలిన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...వరి పంట కోతకు వచ్చిన దశలో వర్షాల వలన గింజలు మొలక రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కోతకు ముందు వర్షాలు వస్తే వరి వెన్నుల మీద 5 శాతం ఉప్పు నీరు(లీటరు నీటికి 50 గ్రాములు ఉప్పును) కలిపి పిచికారీ చేయాలన్నారు. పైరు పనలు తడిస్తే ఉప్పు ద్రావణంలో (లీటర్ నీటికి 50 గ్రాములు ఉప్పు) కంకులను ముంచి ఆరబెట్టి చిన్న కుప్పలుగా వేయాలన్నారు. ఎకరానికి 10 నుంచి 15 కిలోల ఉప్పు అవసరం అవుతుంది. ఇలా చేస్తే 10 నుంచి 15 రోజల వరకు గింజలు పాడవ్వవని తెలియజేశారు. ఉప్పు ద్రావణం వాడకం వీలుకాని పక్షంలో తడిచిన పనలను ఆరనిచ్చి కుప్పలుగా వేసి ఉప్పు పొడిని కంకుల మీద చల్లాలన్నారు. నూర్పిడి తర్వాత వరి ధాన్యం తడిస్తే క్వింటాలు వడ్లకు 1 కిలో ఉప్పు 4 కిలోల ఊక లేదా ఎండుగడ్డి (చిన్న చిన్న ముక్కలుగా) చేసి కలిపి కుప్పగా పోసి వారం రోజుల తర్వాత ఆరబెట్టాలని తెలియజేశారు.

మాచవరం మండలంలో భారీ వర్షాలు



మాచవరం మండలంలోని పిన్నెల్లిలో నేలకొరిగిన వరిపంట

మాచవరం: తుపాన్ ప్రభావంతో మండలంలోని అన్ని గ్రామాల్లో తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు పలు రకాల పంట పొలాలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాలు నీటిమయం అయ్యాయి. ఈ ఏడాది రైతులు హైబ్రీడ్ మిరప ఎక్కువగా సాగు చేస్తున్నారు. మిర్చి పచ్చికాయ దశలో ఉండడంతో వర్షానికి తెల్లకాయులు అయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పాటు గాలులు వీయడంతో కొతదశలో వరి పంట పొలాలు పలు చోట్ల నేలకొరిగాయి. పత్తి పంట దిబ్బతినే అవకాశం ఉంది. అరటి, బొప్పాయి నేలవాలాయి. కూరగాయ పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

మిచాంగ్ తుఫాన్...ఆందోళనలో అన్నదాతలు



మంచికల్లు గ్రామంలో వర్షానికి తడిసిన వరి పనలు

రెంటచింతల: మిచాంగ్ తుపాన్ ప్రభావం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని గ్రామాలలో ముందుగా వేసిన పత్తి పంట ఉరకేసి ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి మనోవేదనకు గురవుతున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిర్చి, వరి పంటలను, కంది, పెసర, కూరగాయలను కొంత మేర రైతులు సాగుచేయగా పంటపొలాల్లో వర్షపు నీరు చేరింది. మండలంలో ఈ ఏడాది 7 వేల ఎకరాలలో వరిపంటను సాగుచేయగా ఈ తుపాన్ కారణంగా కొంత నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. మంచికల్లు, పాలువాయిగేటు, రెంటాల, పాలువాయి, రెంటచింతల గ్రామాలలో 60 శాతం, మిగిలిన గ్రామాలలో రైతులు ఇప్పటికే 30 శాతం వరిపంట కోత కోయించినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి తెలిపారు. నూర్చిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. ఆరబోసిన ధాన్యం మాత్రం కొంత వరకు నష్టం జరిగినట్లు కొంతమంది రైతులు తెలిపారు. మండలంలోని వాగులు పొంగలేదని ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నిరాశ్రయులకు ఆశ్రయం.. ఆహార వితరణ



యడ్లపాడులో స్కూల్లో కందుకూరి వలసలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దార్

యడ్లపాడు: మిచాంగ్ తుపాను కారణంగా వలస కార్మిక కుటుంబాలు, వీధుల వెంబడి కాగితాలు ఏరుకుని వారు నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో సుబాబుల్ తోటల్లో కర్రకొట్టే పనులకు నిమిత్తం ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి సుమారు 10 కుటుంబాలు వలస వచ్చాయి. చిన్నపాటి గుడారాలు కట్టుకుని పనులు చేసుకుంటున్న వీరిని తక్షణమే రెవెన్యూ అధికారులు గ్రామంలోని కారుచోల రోడ్డులోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. అలాగే బోయపాలెం గ్రామంలో కాగితాలు ఏరుకుంటున్న సుమారు 15 మందికి నిరాశ్రయం లేక రోడ్డుపై ఉండటాన్ని గమనించి గ్రామం నుంచి చెంఘీజ్ ఖాన్‌పేట వెళ్లే మార్గంలోని సూపర్ మార్కెట్ వద్ద ఓ ఖాళీ దుకాణంలో నిరాశ్రయం కల్పించారు. రెండు చోట్ల ఆశ్రయం పొందిన వారందరికీ తహసీల్దార్ వైవీబీ కుటుంబారావు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ మోజేసు, వీఆర్వోలు పాల్గొన్నారు.